క్లుప్తంగా

ఘనంగా అభయ గణపతి ఆలయ వార్షికోత్సవం



అలంకరణలో విఘ్నేశ్వరుడు

ఆరిలోవ: జీవీఎంసీ 12వ వార్డు పెదగదిలి కొండపై సాలిపేటలోని అభయ గణపతి ఆలయ ఆరో వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. కమిటీ సభ్యులు విఘ్నేశ్వరుడి విగ్రహాన్ని పూలమాలలతో, ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. సాలిపేట, పెదగదిలి, ఈశ్వరినగర్ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకుని పూజలు, అభిషేకాలు చేశారు. ఆలయ అర్చకుడు ప్రసాద్ శర్మ భక్తులతో పూజలు చేయించారు.

క్షయపై ఖైదీలకు అవగాహన



సెంట్రల్ జైల్‌లో టీబీ బ్యానర్‌తో వైద్య సిబ్బంది

ఆరిలోవ: ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవం సందర్భంగా సోమవారం ఆరిలోవ టీబీ యూనిట్ ఆధ్వర్యంలో విశాఖ కేంద్ర కారాగారంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కారాగారం వైద్య సిబ్బందితో కలిసి టీబీ సిబ్బంది ఖైదీలకు క్షయ వ్యాధి, దాని లక్షణాల గురించి వివరించారు. క్షయ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలని ఖైదీలకు సూచించారు. క్షయ వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యులను సంప్రదించి అవసరమైన వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. క్షయ పరీక్షలు అన్నీ ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉచితంగా చేస్తారన్నారు. 60 ఏళ్లు దాటిన వృద్ధులు, మధుమేహం ఉన్నవారు, పొగతాగే వారు, రోగ నిరోధక శక్తి తక్కువగా ఉన్నవారికి ఎక్కువగా క్షయ వ్యాధి సోకే అవకాశం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో కేంద్ర కారాగారం వైద్యుడు డాక్టర్ ఆర్.వి.ఎస్ కుమార్, డాక్టర్ శ్రీనివాస్, టీబీ యూనిట్ సూపర్‌వైజర్ వేములయ్య, జైల్ సిబ్బంది పాల్గొన్నారు.

బీఈడీ పరీక్ష కేంద్రం తనిఖీ



పరీక్ష కేంద్రంలో డీన్ కేశవరావు

విశాఖ విద్య: ఆంధ్రా యూనివర్సిటీ విద్యా విభాగంలో బీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ మూడో సెమిస్టర్ పరీక్షలు జరుగుతున్నాయి. వీటిని సోమవారం యూనివర్సిటీ పీజీ పరీక్షల డీన్ ఆచార్య కేశవరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రంలో విద్యార్థులకు ఏర్పాటు చేసిన సౌకర్యాలను పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. పరీక్షల నిర్వహణ తీరుపై విభాగాధిపతి ఆచార్య షారోన్ రాజును అడిగి తెలుసుకున్నారు. పరీక్షకు 95 మంది నమోదు చేసుకోగా.. 94 మంది హాజరైనట్లు షారోన్‌రాజు తెలిపారు. పరీక్షలు పారదర్శకంగా నిర్వహించేలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నామని వివరించారు.

పవర్ లిఫ్టింగ్ పోటీల్లో ప్రతిభ



విజేతలను అభినందిస్తున్న మధుకుమార్

సీతంపేట: విజయాంధ్ర వ్యాయామ మండలి ఆదివారం నిర్వహించిన విశాఖ జిల్లా పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్–2025 పోటీల్లో లంకపల్లి బుల్లయ్య కళాశాల విద్యార్థులు సత్తా చాటారు. జూనియర్ కళాశాలకు చెందిన సిహెచ్.లోకేష్ 93 కిలోల విభాగంలో స్వర్ణం, కాంస్య పతకాలు సాధించగా, డిగ్రీ విద్యార్థి ఎ.మోహన్‌వెంకట్ 83 కిలోల విభాగంలో స్వర్ణ పతకం, ఎ.వరప్రసాద్ 74 కిలోల విభాగంలో రజత పతకం, రేవంత్‌రెడ్డి 105 కిలోల విభాగంలో రజత పతకం సాధించారు. పి.భార్గవ్ 120 కిలోల విభాగంలో స్వర్ణ పతకం సాధించగా, ఇంజినీరింగ్ విద్యార్థులు ఎం.డి.వసీం 74 కిలోల విభాగంలో స్వర్ణం, జి.రాఘవ అనూష 63 కిలోల విభాగంలో స్వర్ణ పతకం గెలుపొందారు. ఈ సందర్భంగా సోమవారం విజేతలను బుల్లయ్య కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ జి.మధుకుమార్ అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాళ్లు, విభాగాధిపతులు పాల్గొన్నారు.

నాడు సందడిగా.. నేడు దయనీయంగా...



దెబ్బతిన్న పిల్లల పార్క్ ప్రహరీ.. శిథిలమైన చిన్నారి బొమ్మ



ఆర్కే బీచ్ వద్ద చిల్డ్రన్ పార్క్

ఆర్కే బీచ్ చిల్డ్రన్ పార్క్‌పై నిర్లక్ష్యం

- మూలకు చేరిన ఆట వస్తువులు
- కళతప్పిన బొమ్మలు, పరిసరాలు
- మచ్చుకైనా కానరాని పచ్చదనం
- నిర్వహణను గాలికొదిలేసిన అధికారులు

ఏయూక్యాంపస్: పిల్లలకు ఆహ్లాదాన్ని, ఆనందాన్ని అందించాల్సిన ఆ పార్క్ పరిస్థితి నేడు ఘోరంగా తయారైంది. దానిలో చిన్నారులు ఆడుకోవడానికి మచ్చుకైనా ఆట వస్తువులు అందుబాటులో లేవు. పార్క్ పరిసరాల్లో పచ్చదనం కనుమరుగైంది. శిల్పాలు, బొమ్మల రంగులు వెలిసిపోయి, స్థూపాల పలకలు ఊడిపోయి పూర్తిగా నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలిచాయి. నోవాటెల్ హోటల్‌కు ఎదురుగా ఆర్కే బీచ్ పక్కనున్న ఇందిరా గాంధీ చిల్డ్రన్ పార్క్ దుస్థితి ఇది. ఒకప్పుడు చిన్నారుల రాకతో ఎంతో సందడిగా ఉండే ఈ పార్క్.. ఇప్పుడు బోసిపోయింది. నిర్వహణ లేక.. పట్టించుకునే వారు కానరాక ఇలా తయారైంది. జీవీఎంసీ అధికారులు చొరవ చూపి ఈ పార్క్‌ను ఆధునీకరించి, నిర్వహణపై దృష్టి సారించాలని పలువురు స్థానికులు, సందర్శకులు కోరుతున్నారు.

ఆట వస్తువుల జాడ లేదు

పిల్లల పార్క్ అనగానే వెంటనే గుర్తుకొచ్చేవి ఆట వస్తువులు. ఆర్కే బీచ్ పక్కనే నోవాటెల్ హోటల్‌కు ఎదురుగా ఉన్న ఇందిరా గాంధీ చిల్డ్రన్ పార్క్‌లో పరిస్థితి పూర్తిగా విరుద్ధంగా ఉంది. ఇక్కడ ఒక్క ఆట పరికరం కూడా లేదు. ఊయలలు పూర్తిగా మాయమైపోయాయి. తూగుడు బల్ల ఒకవైపు విరిగిపోయింది. జారుడు బల్ల ఎక్కాలంటే పిల్లలు భయపడే పరిస్థితి ఉంది. జారుడుబల్ల మెట్లు పూర్తిగా తుప్పుపట్టి, విరిగిపోయి కాలు పెడితే గుచ్చుకునే స్థితిలో ఉన్నాయి. రాత్రి వేళల్లో పిల్లలు ఎవరైనా తెలియక కాలు వేస్తే గాయాల పాలవడం తథ్యం.



పార్క్‌లో జాడ లేని ఊయలలు

కళావిహీనంగా శిల్పాలు

పిల్లల పార్క్‌కు ప్రత్యేక ఆకర్షణగా ఒక చిన్నారి భారీ శిల్పం, రెండు ఏనుగుల బొమ్మలు, మత్స్యకారుడి శిల్పం ఉన్నాయి. ప్రస్తుతం ఈ శిల్పాలు రంగులు వెలిసిపోయి కళావిహీనంగా తయారయ్యాయి. ఏనుగుల బొమ్మలు ఎవరూ గుర్తించలేని విధంగా మారాయి. రెండు ఏనుగుల మధ్యలో ఉండే చిన్నపాటి స్థూపం చుట్టూ వేసిన గ్రానైట్ పలకలు ఊడిపోయాయి.



రంగులు వెలిసిపోయిన ఏనుగు బొమ్మలు

పచ్చదనం కనుమరుగు

పార్క్ అనగానే అందమైన మొక్కలు, మెత్తటి గడ్డి లాన్‌లు ఉంటాయని భావిస్తారు. ఈ పార్క్‌లో ప్రస్తుతం అక్కడక్కడ నాలుగు మొక్కలు మాత్రమే కనిపిస్తున్నాయి. వీటి నిర్వహణ కూడా అంతంత మాత్రంగానే ఉంది. పార్క్ ప్రహరీ గోడను ఇటీవల భారీ లారీ వచ్చి ఢీకొట్టింది. దీంతో నాటి నుంచి పార్క్ ప్రహరీని పునరుద్ధరించే చర్యలు సైతం అధికారులు తీసుకోలేదు.



పచ్చదనం లేని పార్క్ ప్రాంగణం

నిరుపయోగంగా ఫౌంటెయిన్

చిల్డ్రన్ పార్క్‌లో ఆహ్లాదాన్ని పంచడానికి ఏర్పాటు చేసిన వాటర్ ఫౌంటెయిన్ వినియోగం లేదు. దానిలోని నీరు నాచు పట్టి మురుగు కూపంలా కనిపిస్తోంది. గతంలో ఈ పార్క్ నిర్వహణను వరుణ్ గ్రూప్ చేపట్టినట్లు పార్క్‌లో పలు చోట్ల బోర్డులు మాత్రం కనిపిస్తున్నాయి. వాస్తవానికి పార్క్ నిర్వహణను గాలికొదిలేశారని ఇక్కడి పరిసరాలు, పరిస్థితులను చూస్తే అర్థమవుతుంది.



మురుగు కూపంలా ఫౌంటెయిన్

ప్రజా ఫిర్యాదులకు తక్షణ పరిష్కారం



పీజీఆర్‌ఎస్ కార్యక్రమంలో జోన్–3 కమిషనర్ శివప్రసాద్

సీతమ్మధార: ఆశీలమెట్టలోని జోన్–3 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుంచి జోనల్ కమిషనర్ కె.శివప్రసాద్ రెండు ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హౌస్ టాక్స్, టౌన్ ప్లానింగ్ విభాగాలకు అందిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో యూసీడీ విభాగం ఏపీడీ ఎల్.రాము, ఆర్వో పైడిరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం



చెక్ అందిస్తున్న దాత అప్పారావు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి అన్నప్రసాద పథకానికి నగరంలోని శివాజీపాలేనికి చెందిన దువ్వి అప్పారావు సోమవారం రూ.లక్ష 116 విరాళమిచ్చారు. సంబంధిత విరాళాన్ని చెక్ రూపంలో సింహగిరిపై ఉన్న పీఆర్వో కార్యాలయంలో అందించారు. ఆలయ సంప్రదాయం ప్రకారం దాతకు స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదం, శేషవస్త్రంను అధికారులు అందజేశారు.

విద్యార్థుల ఉజ్వల భవితకు గ్రంథాలయాలు దోహదం



లైబ్రేరియన్ల వర్క్‌షాప్ ప్రారంభ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విజయబాబు తదితరులు

మద్దిలపాలెం: డాక్టర్ వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో సోమవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలల లైబ్రేరియన్ల వర్క్‌షాప్ ప్రారంభమైంది. ఈ సందర్భంగా ముఖ్య అతిథి కృష్ణా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు మాట్లాడుతూ విద్యార్థుల ఉజ్వల భవితకు గ్రంథాయాల సేవలు ఎంతో దోహదపడతాయన్నారు. ఆంధ్రా యూనివర్సిటీ చీఫ్ లైబ్రేరియన్ ప్రొఫెసర్ పి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గ్రంథాలయాల ఆవశ్యకతను తెలియజేశారు. నేటి డిజిటల్ యుగంలో గ్రంథాలయాల పాత్ర, ఉపయోగించాల్సిన వివిధ రకాల సాఫ్ట్‌వేర్‌ల గురించి వివరించారు. సెంటర్ గాంధీనగర్ అహ్మదాబాద్‌కు చెందిన సైంటిస్ట్ హేమ చోలిన్ రిసోర్స్ పర్సన్‌గా విచ్చేసి గ్రంథాలయాలను డిసిప్టలైజేషన్ చేయడంలో ఉపయోగించే సాఫ్ట్‌వేర్ గురించి పూర్తిస్థాయిలో గ్రంథాలయ అధికారులకు అవగాహన కల్పించారు. ఆర్గనైజింగ్ సెక్రటరీగా వ్యవహరించిన కృష్ణా కళాశాల గ్రంథాలయ అధికారి డాక్టర్ ఎం.శ్రీనివాస ప్రసాద్ మాట్లాడుతూ వర్క్‌షాప్‌కు రాష్ట్ర వ్యాప్తంగా 40 మంది లైబ్రేరియన్లు హాజరయ్యారని తెలిపారు. కళాశాలల గ్రంథాలయాలు విద్యార్థులకు అందిస్తున్న వివిధ సేవలను గురించి తెలియజేస్తూ, గ్రంథాలయం డిజిటలైజేషన్ చేయడంతో సేవలు మరింత చేరువవుతున్నాయన్నారు. త్వరితగతిన విద్యార్థులకు, అధ్యాపకులకు తమ పరిశోధనకు సంబంధించిన అత్యంత విలువైన సమాచారాన్ని అందుబాటులోకి తెచ్చేలా కార్యక్రమాన్ని రూపొందించామని తెలిపారు.

ఎం.ఎన్.శాస్త్రి జీవితం ఆదర్శనీయం



ఐఐటీ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణరావును సత్కరిస్తున్న ఏయూ వీసీ రాజశేఖర్

విశాఖ విద్య: విశిష్ట పరిశోధకుడిగా, పరిపాలన దక్షుడిగా జాతీయ స్థాయిలో అవార్డులు పొందిన ఆచార్య ఎం.ఎన్.శాస్త్రి జీవితం నేటి యువతకు స్ఫూర్తిని కలిగిస్తుందని ఏయూ వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ అన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం రసాయన శాస్త్ర విభాగంలో సోమవారం ఆచార్య ఎం.ఎన్.శాస్త్రి స్మారక ఉపన్యాసం ఏర్పాటు చేశారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి పుష్పాంజలి ఘటించారు. వీసీ మాట్లాడుతూ ఆచార్య ఎం.ఎన్ శాస్త్రి స్మారక ఉపన్యాసం నిర్వహించడం, ఈ కార్యక్రమ ఏర్పాటుకు విభాగం చొరవ తీసుకోవడంపై సంతోషం వ్యక్తం చేశారు. సుదీర్ఘ కాలం అత్యుత్తమ సేవలు అందించిన వారిని గుర్తు చేసుకోవడం, నేటి తరం యువతకు వీరిని పరిచయం చేయడం, వీరి పరిశోధనలు, విశిష్టతను తెలియజేయడం ముదావహమని చెప్పారు. ఉత్సుకత వ్యక్తి ప్రగతికి ప్రేరణ శక్తిగా నిలుస్తుందని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ–కాన్పూర్) రసాయన శాస్త్ర విభాగ ఆచార్యుడు ఎం.లక్ష్మీనారాయణరావు అన్నారు. నూతన అంశాలను నేర్చుకోవాలని తపన, జిజ్ఞాస విద్యార్థులు ఎల్లవేళలా కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎం.వి.ఆర్.రాజు, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య జి.గిరిజా శంకర్, అకడమిక్ డీన్ ఆచార్య కె.ఈశ్వర్‌కుమార్, విభాగాచార్యులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సరస్వతిపై చర్యలు చేపట్టాలని సీపీకి వినతి



సీపీ కార్యాలయం ఎదుట ఫిర్యాదు పత్రాలను ప్రదర్శిస్తున్న బాధితులు

ఎంవీపీకాలనీ: చీటీల పేరుతో మోసాలకు పాల్పడుతున్న శివాజీపాలేనికి చెందిన సరస్వతిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పలువురు బాధితులు సోమవారం నగర పోలీస్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం సీపీ కార్యాలయం ఎదుట బాధితులు ఫిర్యాదు పత్రాలను ప్రదర్శించి మాట్లాడారు. శివాజీపాలెం, పెదవాల్తేరు, ఆరిలోవతోపాటు అనేక ప్రాంతాలకు చెందిన తమతో సంచాన సరస్వతి అనే మహిళ చీటీలు కట్టించి అనంతరం మోసం చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇప్పటికే ఆమెపై ఎంవీపీ పోలీస్ స్టేషన్‌లో మూకుమ్మడిగా ఫిర్యాదులు చేసినట్లు తెలిపారు. సరస్వతి కొన్నేళ్లుగా నగరంలోని వేరు వేరు ప్రాంతాల్లో వ్యక్తుల నుంచి చీటీలు వేస్తున్నట్లు చెప్పారు. ఒక్కొక్కరికి చీటీల వసూళ్ల కోసం బాధ్యతలు అప్పగించి వారి నుంచి కలక్షన్ చేసిన డబ్బులు తీసుకొని చీటీల నిర్వాహణ, కేటాయింపులు చేసేదన్నారు. నెలవారీ కలక్షన్ చేసిన డబ్బులను చీటీలు పాడుకున్న వారికి సకాలం ఇవ్వకపోవడం, కొన్ని సార్లు డబ్బులు కలక్షన్ చేసిన వారిదే బాధ్యతని చెప్పి తప్పించుకొని తిరగడం చేస్తున్నట్లు తెలిపారు. ఈ కారణంగానే కలెక్షన్ ఏజెంట్లుగా ఉన్న తామంతా అనేక ప్రాంతాల్లో బాధితులుగా మారామని వాపోయారు. సీపీకి వినతి పత్రం అందజేసిన వారిలో వంగపండు సత్యనారాయణ, గుంటు కామేశ్వరి, ధర్మవరపు సూర్యనారాయణ, వి.కుమారి తదితరులున్నారు.

పిల్లలకు మంచి చెడులు చెప్పాల్సింది తల్లిదండ్రులే



పోక్సో చట్టంపై అవగాహన కల్పిస్తున్న 2వ అదనపు చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ వరలక్ష్మి

అల్లిపురం: పిల్లలకు మంచి ఏదో.. చెడు ఏదో చెప్పాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందని నగరంలో 2వ అదనపు చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఎస్.వరలక్ష్మి తెలిపారు. టూటౌన్ పోలీసుల ఆధ్వర్యంలో పోక్సో చట్టంపై ప్రేమసమాజంలో సోమవారం జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఏ టచ్ ఎలాంటిదో, ఎవరిని దగ్గరికి రానివ్వకూడదో, ఎవరు ఎక్కడ తాకకూడదో పిల్లలకు చెప్పేందుకు తల్లిదండ్రులు సంకోచిస్తున్నారని పేర్కొన్నారు. ఈ ధోరణిని తల్లిదండ్రులు త్వరగా విడనాడి, పిల్లలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన పెంచాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. పిల్లలకు ఆ విషయాలపై అవగాహన లేకుంటే, ఇలాంటి దారుణాలు జరుగుతూనే ఉంటాయన్నారు. పోక్సో చట్టంలో ప్రధాన అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మహిళా శిశు అభివృద్ధి అసోసియేషన్ ప్రతినిధి సులేఖ, న్యాయవాది అంజని కుమారి, పోలీస్ చైల్డ్ వెల్ఫేర్ ఆఫీసర్ ఏఎస్ఐ కాంతం, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

డెలివరీ బాయ్‌ను హింసించిన వ్యక్తిపై

కఠిన చర్యలు తీసుకోవాలి

ఎంవీపీకాలనీ: సీతమ్మధార ఆక్సిజన్ టవర్స్‌లో ఫుడ్ డెలివరీ చేసేందుకు వెళ్లిన సాయికుమార్ అనే యువకుడిపై దాడి చేసిన ప్రసాద్‌పై ఎంవీపీ పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని ఆర్టీఐ హ్యూమన్ రైట్స్ దక్షిణాది రాష్ట్రాల చైర్మన్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి బి.సన్నీ కృష్ణ(ఆల్ఫా కృష్ణ) సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. దళిత సామాజిక వర్గానికి చెందిన సాయికుమార్ దుస్తులు విప్పించి విచక్షణారహితంగా దాడి చేయడం దారుణమన్నారు. డెలివరీ బాయ్ ఏదైనా తప్పుచేసి ఉంటే చట్టపరమైన చర్యలకు ప్రసాద్ డిమాండ్ చేసుంటే బాగుండేదన్నారు. అలాకాకుండా డబ్బుందనే అహంతో గదిలో బంధించి, దుస్తులు విప్పించి, హింసించి కర్రతో దాడి చేయడం హేయమైన చర్యగా పేర్కొన్నారు. ప్రసాద్‌పై ఎంవీపీ పోలీసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. నగర పోలీస్ కమిషనర్ బాగ్చి ఈ దాడి కేసును ప్రత్యేకంగా తీసుకోవాలని కోరిన ఆయన బాధితుడికి జరిగిన అన్యాయంపై అన్ని కోణాల్లో దర్యాప్తు చేయించాలని సూచించారు. సోమవారం సాయికుమార్‌తో మాట్లాడినట్లు తెలిపిన ఆల్ఫా కృష్ణ యువకుడికి ఆర్టీఐ హ్యూమన్ రైట్స్ సంస్థ తరఫున అండగా ఉంటామని హామీ ఇచ్చినట్లు వెల్లడించారు.

'పీజీఆర్‌ఎస్'కు ఐదు వినతులు

సీతమ్మధార: సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పీజీఆర్‌ఎస్) కార్యక్రమానికి ఐదు వినతులు అందాయి. ప్రజల నుంచి వాటిని తహసీల్దార్, మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ ఎం.రమేష్ స్వీకరించి పరిశీలించారు. కుల, ఆదాయ, నివాస, కుటుంబ సభ్యత్వ ధ్రువీకరణ పత్రాల కోసం పలువురు దరఖాస్తు చేసుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ఎ.త్రినాథ్, ఆర్ఐ ఇబ్రహీం, వీఆర్‌వోలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

సామాజిక భద్రత చట్టం అమలు చేయాలి

సీతమ్మధార: క్యాబ్ డ్రైవర్లకు పీఎఫ్, ఈఎస్ఐతో కూడిన సామాజిక భద్రత చట్టాన్ని అమలు చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.కె.ఎస్.వి.కుమార్ డిమాండ్ చేశారు. జీవీఎంసీ మోటారు ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్, ఓలా, ఉబర్, రాపిడో కార్మికుల సమస్యలపై విశాఖ క్యాబ్ డ్రైవర్స్ యూనియన్, విశాఖ ఆటో రిక్షా కార్మిక సంఘం, జిల్లా మోటార్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ యూనియన్(సిటు) ఆధ్వర్యంలో సోమవారం దర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ డ్రైవర్లు, కష్టమర్లకు ఉపయోగపడే ఉబర్, రాపిడో, ఓలా తరహా యాప్ కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేయాలన్నారు.

బాలికలకు ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం



బాలికలకు సూచనలిస్తున్న పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి

సీతమ్మధార: విశాఖపట్నం గ్లోబల్ పింక్ ఆర్మీ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో సోమవారం సీతమ్మధార బాలికల పాపా హోంలో బాలికలు, అమ్మాయిల కోసం మహిళా సాధికారత, గైనిక్, యోగా, ఇతర విషయాలపై ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి పాపా హోం చైర్మన్, నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి మాట్లాడుతూ బాలికలు, మహిళలు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఆరోగ్యాన్ని కోల్పోతే జీవించలేం కనుక వ్యాధులకు సంబంధించి వైద్యులు ఇచ్చే సూచనలను తప్పనిసరిగా పాటించి సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందాలని సూచించారు. వైద్య శిబిరం నిర్వహించిన గ్లోబల్ పింక్ ఆర్మీ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. బాలికలు మహిళల కోసం ఇటువంటి కార్యక్రమాలు రాష్ట్ర వ్యాప్తంగా చేపడుతున్నట్టు గ్లోబల్ పింక్ ఆర్మీ విశాఖ అధ్యక్షురాలు కొత్తపల్లి గీత తెలిపారు. వివిధ విభాగాలకు చెందిన వైద్యులు బాలికలకు సంపూర్ణ ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన నియమాలను తెలిపి, తగు సూచనలు, సలహాలిచ్చారు.

చెడు సావాసాలతో జీవితం అంధకారం



ప్రసంగిస్తున్న న్యాయమూర్తి కార్తీక్

బీచ్‌రోడ్డు: చెడు సావాసాలతో జీవితం అంధకారమవుతుందని నగరంలోని మూడో అదనపు జూనియర్ కోర్టు న్యాయమూర్తి జి.కార్తీక్ అన్నారు. బీచ్ రోడ్డులోని జీవీపీ ఎంఎల్‌బీటీ పాఠశాల ఆవరణలో జిల్లా న్యాయ సేవ ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో సోమవారం చట్టంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రిమినల్ కేసులు కలిగి ఉంటే ఉన్నత అవకాశాలు కోల్పోతారన్నారు. ప్రభుత్వ సంస్థల్లో ఉద్యోగాల విషయంలో ఎంతో జాగ్రత్తగా ఉండాలని, ఎటువంటి కేసులు ఉండరాదన్నారు. పోక్సో చట్టంలో కీలక అంశాలను వివరించారు. వివాహ వయసుకు ముందు కౌమార దశలో విద్యార్థులు చట్ట వ్యతిరేకంగా ప్రవర్తిస్తే శిక్షకు గురికావలసి వస్తుందన్నారు. పూర్తిస్థాయిలో చదువుపై దృష్టి సారించాలని, సెల్‌ఫోన్లకు, సామాజిక మాధ్యమాలకు బానిసలుగా మారొద్దని, గుడ్ టచ్, బ్యాడ్ టచ్ పట్ల అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. త్రీ టౌన్ ఎస్ఐ సంతోష్‌కుమార్ మాట్లాడుతూ క్రమశిక్షణతో కూడిన జీవన విధానం, తల్లిదండ్రులను గౌరవించడం అలవాటు చేసుకోవాలన్నారు. విద్యార్థి దశలో చేసే తప్పులు జీవితాన్ని ఛిద్రం చేస్తాయన్నారు. లక్ష్యాన్ని గుర్తుచేసుకుంటూ మంచి జీవితాన్ని పొందాలని సూచించారు. పాఠశాల ప్రిన్సిపాల్ కె.మధురవాణి మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలలో తెలిసో, తెలియకో భాగమైనా అవి జీవితంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతాయన్నారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

అసంపూర్తిగా వదిలేశారు.. వినతులు పట్టించుకోరు



జోడుగుళ్లపాలెంలో నిర్మాణం పూర్తిచేయకుండా వదిలేసిన సామాజిక భవనం

ఆరిలోవ: జీవీఎంసీ తొమ్మిదో వార్డులో సామాజిక భవన నిర్మాణాన్ని అసంపూర్తిగా వదిలేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తూర్పు నియోజకవర్గంలో పలు చోట్ల అభివృద్ధి పనులు నిలిచిపోయాయి. కొన్నిచోట్ల జరుగుతున్న పనులను పూర్తిగా రద్దు చేసేశారు. ఇంకొన్ని చోట్ల మధ్యలో ఆపేశారు. జోడుగుళ్లపాలెంలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన ఓ సామాజిక భవనం పనులను పూర్తిచేయకుండా మధ్యలో నిలిపివేశారు. దీన్ని పూర్తి చేయాలని కోరుతూ వార్డు కార్పొరేటర్ కోరుకొండ వెంకటస్వాతి సంబంధిత అధికారులకు విన్నవించినా ఫలితం కనిపించలేదు. జీవీఎంసీ కమిషనర్‌కు పలుమార్లు వినతిపత్రాలు అందించారు. వారం కిందట గ్రీవెన్స్‌లో కలెక్టర్ హరేందిర ప్రసాద్‌కు సామాజిక భవన నిర్మాణం పూర్తి చేయించాలని విన్నవించుకున్నారు. జోడుగుళ్లపాలెంలో బీచ్ రోడ్డును ఆనుకొని సామాజిక భవన నిర్మాణం కోసం 2022లో రూ.75 లక్షలు నిధులు మంజూరయ్యాయి. దీనిలో జీవీఎంసీ రూ.50 లక్షలు, ఎంపీ నిధులు రూ.25 లక్షలు మంజూరైనట్లు చేశారు. కొద్ది రోజుల తర్వాత పనులు ప్రారంభించారు. భవన నిర్మాణం జరుగుతుండగా 2024 ఏప్రిల్‌లో సాధారణ ఎన్నికల జరగడం, కూటమి ప్రభుత్వం ఏర్పడంతో దీనికి గ్రహణం పట్టింది. అప్పటి నుంచి భవన నిర్మాణం గురించి అధికారులు పట్టించుకోలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో చేపట్టిన భవనం కావడంతో కూటమి నాయకులు అధికారులతో పనులు జరిపించకుండా వదిలేశారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రజా అవసరాల కోసం వినియోగించాల్సిన ఈ భవనం పనులను వెంటనే పూర్తిచేయాలని జీవీఎంసీ అధికారులను జోడుగుళ్లపాలెం వాసులు కోరుతున్నారు.

రైల్వే స్టేషన్‌లో 10.5 కిలోల గంజాయి స్వాధీనం

తాటిచెట్లపాలెం: విశాఖ రైల్వే స్టేషన్ మీదుగా గంజాయిని అక్రమంగా రవాణా చేస్తున్న వ్యక్తిని సోమవారం రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకుని, 10.5 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. గవర్నమెంట్ రైల్వే పోలీసులు తెలిపిన వివరాలిలా.. ఉన్నతాధికారుల ఆదేశాలతో విశాఖ జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సిహెచ్.ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో ఎస్ఐ ఎస్.రామారావు, ఆర్పీఎఫ్ ఎస్ఐ ఒబిషేక్ మిస్త్రీ వారి వారి సిబ్బందితో కలిసి విశాఖ రైల్వే స్టేషన్‌లోని పలు ప్లాట్‌ఫారాల్లో తనిఖీలు నిర్వహించారు. మధ్యప్రదేశ్ రాష్ట్రం చింద్వారా జిల్లాకు చెందిన గజానన్ కుర్సేంగే విశాఖ స్టేషన్ మీదుగా అక్రమంగా గంజాయిని రవాణా చేయడం ఆర్పీఎఫ్ సిబ్బంది గుర్తించి, అదుపులోకి తీసుకుని జీఆర్పీ ఎస్ఐకు అప్పగించారు. నిందితుడి నుంచి రూ.52.5 వేల విలువైన 10.5 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని, రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరచినట్లు జీఆర్పీ సిబ్బంది తెలిపారు.